పత్రికతో.. మార్పులు
APTEL/25/A1880
TN తెలుగు న్యూస్
దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
సంపుటి : 1 సంచిక : 709 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ ఆదివారం 06.09.2026 పేజీలు : 8 వెల : 4/-

# ఏపీ ఉద్యోగులకు తీపి కబురు

# 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

**ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం**

- పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు, రెండు డీఏల విడుదలకు అంగీకారం
- సరెండర్ లీవులు, అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయాలు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం

2లో





## విజయవాడలో అట్టహాసంగా గురుపూజోత్సవం..

- 175 మంది ఉత్తమ గురువులకు చంద్రబాబు, లోకేశ్ సత్కారం
- 175 మంది ఉత్తమ గురువులకు పురస్కారాలు అందజేత
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. విజయవాడలోని ఏకన్వెన్షన్ సెంటర్‌లో మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుక పండుగ వాతావరణంలో సాగింది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరై, రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 175 మంది ఉత్తమ

తరువాయి 2లో

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం..

### రెడ్ అలర్ట్ జారీ!



- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు
- వాతావరణ శాఖ నుంచి రెడ్ అలర్ట్ జారీ
- లోతట్టు ప్రాంతాలు జలమయం, విమాన సేవలకు అంతరాయం
- ప్రయాణికులు ముందుగానే విమాన వివరాలు చూసుకోవాలని సూచన
- రేపటి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం

2లో



## కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్

### పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం

- కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు స్పందన లేదన్న వార్తల్లో నిజం లేదన్న కేంద్రం
- ఆరోపణలను ఖండించిన కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ
- ఇప్పటికే టీఎఫ్‌ఎల్, ఎన్‌టీపీసీల నుంచి దరఖాస్తులు వచ్చాయని వెల్లడి
- 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ లక్ష్యం

2లో

## అత్యంత స్ఫూర్తిదాయక నేత మోదీ



- మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య
- విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని

ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తరువాయి 2లో



## పాక్‌కు గట్టి సంకేతం..

### సింధు నదిపై భారత్ కొత్త ప్లాన్!

- సింధు నదిపై భారత్ తొలి రాక్ చెక్ డ్యామ్
- లడఖ్ లోని ఉప్షి వద్ద నిర్మాణం
- దాదాపు 10 అడుగులు పెరిగిన నీటి మట్టం
- డ్యామ్‌లో 4 కోట్ల లీటర్ల నీటి నిల్వ
- ఇగూ ఫే కాలువ ద్వారా పొలాలకు నీరు

2లో

## విద్యాశాఖలో మార్పులు

### ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ భరోసా



- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ

2లో

## ఇక ప్రపంచ పటం మారనుందా?

## ఐక్యరాజ్య సమితిలో కీలక తీర్మానం

- కొత్త ప్రపంచ పటానికి యూఎన్‌ఓ ఆమోదం
- 164 దేశాలు తీర్మానానికి అనుకూలం
- అమెరికా మాత్రమే వ్యతిరేకంగా ఓటు
- కొత్త పటంలో పెద్దగా కనిపించనున్న ఆఫ్రికా
- ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్‌కు ప్రోత్సాహం




ప్రపంచ పటాన్ని చూడగానే ఆఫ్రికా కంటే యూరప్, ఉత్తర అమెరికా పెద్దవిగా కనిపిస్తాయి. కానీ వాస్తవ పరిస్థితి అలా కాదు. భూమి ఆకారాన్ని చదునైన పటంగా మార్చినప్పుడు ఏర్పడిన వక్రీకరణే దీనికి కారణం. ఇప్పుడు ఈ తేడాను సరిచేసేందుకు ఐక్యరాజ్యసమితి కీలక నిర్ణయం తీసుకుంది. ఆఫ్రికా అసలు పరిమాణానికి దగ్గరగా కనిపించే కొత్త పటానికి జనరల్ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. టోగో నేతృత్వంలో వచ్చిన తీర్మానానికి 164 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఒక్క అమెరికా మాత్రమే వ్యతిరేకించింది. మరో ఆరు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఈ నిర్ణయాన్ని ఆఫ్రికన్ యూనియన్ స్వాగతించింది. ప్రపంచ భౌగోళిక చిత్రణ మరింత కచ్చితంగా, సమానంగా ఉండేందుకు ఇదొక చారిత్రక అడుగు అని పేర్కొంది.

తరువాయి 2లో

# విజయవాడలో అట్టహాసంగా గురుపూజోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల అభిప్రాయాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాల్ బోర్డులను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆసక్తిగా తిలకించి, పలు సూచనలు చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ విద్యా విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన 175 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించారు. పాఠశాల విద్య నుంచి 79 మంది, ఇంటర్మీడియట్ నుంచి 24, సాంకేతిక విద్య నుంచి 14, విశ్వవిద్యాలయాల నుంచి 35 మంది, కళాశాల విద్య నుంచి 17 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగాల నుంచి ఆరుగురికి ఈ పురస్కారాలు దక్కాయి. అవార్డు గ్రహీతలను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, మెడల్, జ్ఞాపికతో పాటు రూ.20 వేల నగదు బహుమతిని సీఎం, మంత్రి అందజేశారు. వేడుకలో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం లభించింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన టీచర్ రమ్యసుధ, కడప జిల్లాకు చెందిన స్కిల్ హబ్ కోఆర్డినేటర్








కె. వెంకట్రావులను ముఖ్యమంత్రి చంద్రబాబు తన పక్కనే వేదికపై కూర్చోబెట్టి సమున్నతంగా గౌరవించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.













# ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం..

## రెడ్ అలర్ట్ జారీ!

దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షం ముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయని విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది. నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్‌లో మోటార్ల సాయంతో నీటిని తోడివేస్తున్నప్పటికీ, కొన్ని దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రేటర్ నోయిడా, నోయిడా ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాల ప్రభావంతో ఢిల్లీ వాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అయితే, ఆదివారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, సెప్టెంబర్ 7 నుంచి కేవలం తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# పాక్‌కు గట్టి సంకేతం.. సింధు నదిపై భారత్ కొత్త ప్లాన్!

లడఖ్‌లో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు భారత్ ఊరటనిచ్చింది. సింధు నదిపై దేశంలోనే తొలి రాక్ చెక్ డ్యామ్‌ను నిర్మించింది. లేహ్‌లోని ఉప్షి వద్ద నిర్మించిన ఈ డ్యామ్ వల్ల నదిలో నీటి మట్టం దాదాపు 10 అడుగులు పెరిగింది. దీంతో వసంతకాలంలో సాగుకు నీరు అందక ఇబ్బంది పడుతున్న గ్రామాల పొలాలకు నీటిని మళ్లించే అవకాశం ఏర్పడింది. ఈ డ్యామ్‌ను సిమెంట్ ఉపయోగించకుండా పూర్తిగా సహజమైన పెద్ద రాళ్లతో నిర్మించారు. ఇందులో దాదాపు 4 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని ఇగూ ఫే సాగునీటి కాలువ ద్వారా పొలాలకు అందిస్తున్నారు. ఇప్పటివరకు లడఖ్‌లోని పలు ప్రాంతాల్లో సింధు నది లోతైన లోయల మధ్య తక్కువ స్థాయిలో ప్రవహించేది. దీంతో వసంతకాలంలో పంపుల ద్వారా నీటిని తీసుకోవడం రైతులకు సాధ్యమయ్యేది కాదు. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉప్షి వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ స్థానిక వ్యవసాయానికి ఉపయోగపడటంతో పాటు వ్యూహాత్మకంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన పరిస్థితుల్లో సరిహద్దు ప్రాంతాల్లో నదీ జలాలను వినియోగించుకునేందుకు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామనే సంకేతాన్ని ఈ ప్రాజెక్టు ఇస్తోంది. లడఖ్ పాలన యంత్రాంగం ఇలాంటి మరిన్ని చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఇందుకోసం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు 36 ప్రాజెక్టులతో ప్రతిపాదన పంపింది. ఇందులో లేహ్ ప్రాంతంలో 7 హిమాలయన్ రాక్ చెక్ డ్యామ్‌లు, కార్గిల్‌లో 29 చెక్ డ్యామ్‌లు ఉన్నాయి. వీటి అంచనా వ్యయం రూ.56 కోట్లకు పైగానే ఉంది.

# ఇక ప్రపంచ పటం మారనుందా? ఐక్యరాజ్య సమితిలో కీలక తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

కొత్తగా ప్రోత్సహిస్తున్న పటాన్ని 'ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్' అంటారు. ఇది 2018లో రూపొందించారు. ఇందులో దేశాలు, ఖండాలు వాటి వాస్తవ భూవైశాల్యానికి అనుగుణంగా కనిపిస్తాయి. దీంతో ఆఫ్రికా పరిమాణం పెద్దగా కనిపిస్తుంది. యూరప్, ఉత్తర అమెరికా పరిమాణం మాత్రం మెర్కేటర్ పటంతో పోలిస్తే తగ్గుతుంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్న మెర్కేటర్ పటాన్ని 1569లో ఫ్లెమిష్ కార్టోగ్రాఫర్ గెరార్డస్ మెర్కేటర్ రూపొందించారు. సముద్ర ప్రయాణాల్లో దిశలు, కోణాలను కచ్చితంగా చూపించేందుకు ఇది ఉపయోగపడుతుంది. అయితే భూమి గుండ్రని ఆకారాన్ని చదునైన పటంగా మార్చడం వల్ల ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దగా కనిపిస్తాయి. అందుకే గ్రీన్‌లాండ్ దాదాపు ఆఫ్రికా అంత పెద్దదిగా కనిపిస్తుంది. వాస్తవానికి ఆఫ్రికా గ్రీన్‌లాండ్ కంటే దాదాపు 14 రెట్లు పెద్దది. అయితే యూఎన్‌ఓ నిర్ణయం వల్ల మెర్కేటర్ పటం వెంటనే కనుమరుగుకాదు. ఈ తీర్మానం తప్పనిసరి కాదు. దేశాలు, పాఠశాలలు, ప్రచురణ సంస్థలు, టెక్ కంపెనీలు కొత్త పటాన్ని స్వచ్ఛందంగా స్వీకరించాల్సి ఉంటుంది. టోగో మాత్రం ఈ ఏడాది చివరికల్లా తమ పాఠశాలల భౌగోళిక పుస్తకాల్లో కొత్త పటాన్ని తీసుకురావాలని నిర్ణయించింది.

# అత్యంత స్ఫూర్తిదాయక నేత మోదీ

(మొదటిపేజీ తరువాయి)

తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

# విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్

# పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం

దేశంలో కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి ఆదరణ కరవైందంటూ వస్తున్న కథనాలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రూ. 37,500 కోట్ల ప్రోత్సాహకాలతో కూడిన ఈ పథకానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్న ప్రచారాన్ని కేంద్రం తోసిపుచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఇటువంటి అసత్య ప్రచారాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపలేవని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ పథకం కింద తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (టీఎఫ్ఎల్), ఎన్‌టీపీసీ నుంచి దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. ఈ పథకానికి సంబంధించిన తొలి విడత దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 7తో ముగియనుందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 25 ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని, తద్వారా సుమారు రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 3 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈ ఏడాది మే నెలలో ఈ ప్రతిష్ఠాత్మక పథకానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

# ఏపీ ఉద్యోగులకు తీపి కబురు 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేసిన ఆయన, వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. శనివారం వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాల ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుందని సీఎం కార్యాలయం వెల్లడించింది.



* **ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన చర్చల అనంతరం ప్రభుత్వం తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇవే:**
* 12వ పీఆర్సీ (PRC): ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు.
* డీఏల చెల్లింపు: 2024 జూలై 1, 2025 జనవరి 1 తేదీలకు చెందిన రెండు కరువు భత్యం (డీఏ) బకాయిలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించాలని నిర్ణయించారు.
* సరెండర్ లీవులు: 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి అంగీకరించారు.
* పోలీసులకు అదనపు లీవ్: పోలీసు సిబ్బందికి ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరా పండుగకు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు.
* అదనపు పెన్షన్: అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేయనున్నారు. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ లభిస్తుంది.
* ఉద్యోగుల ఆరోగ్య పథకం (EHS): ఈహెచ్‌ఎస్‌ను మరింత పటిష్ఠం చేయాలని, వచ్చే నెల నుంచే ప్రతినెలా బిల్లుల చెల్లింపులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు ప్రభుత్వం నేరుగా చెల్లించాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## సంపాదకీయం

# జగన్ వర్సెస్ విజయసాయిరెడ్డి
# ఢిల్లీ అండ, న్యాయ చిక్కుల మధ్య రాజకీయ చదరంగం!

విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారతానని బెదిరిస్తున్నారు. ఆయన బెదిరించగానే జగన్‌మోహన్‌రెడ్డి బెదిరిపోతాడా లేదా అని చాలామంది ఆలోచిస్తున్నారు. బెదరొచ్చు, బెదరకపోవచ్చు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగానే ఊహించే జగన్‌పై ఉన్న కేసుల్లో వై.ఎస్. రాజశేఖరరెడ్డిని ముద్దాయిగా చేశారు. ఆ కేసుల్లో అధికార దుర్వినియోగం చేసింది రాజశేఖరరెడ్డి. సాంకేతికంగా జగన్‌మోహన్‌రెడ్డి అప్పుడు అధికారంలో లేరు. ఇవన్నీ ఆలోచించే రాజశేఖరరెడ్డిని స్వయంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆ కేసుల్లో ఇరికించారు. ఆ విషయం షర్మిలకు కూడా తెలియదు. ఆ ధైర్యం లేకుంటే జగన్‌మోహన్‌రెడ్డి విజయసాయిరెడ్డిని నెత్తిన పెట్టుకునే ఉండేవారు. జగన్ న్యాయవాదుల సలహానుసారం తండ్రిని ముద్దాయిని చేసిన కారణమే అది. సీబీఐ పేర్కొన్న ఛార్జ్‌షీట్‌లో కూడా రాజశేఖరరెడ్డి తన కుమారుడి వ్యాపార సంస్థల్లోకి విదేశీ, దేశీయ సంస్థలు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి తన అధికార హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. తన కొడుకు వ్యాపార ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూముల కేటాయింపు, గనుల లీజులు, సెజ్ అనుమతులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల నిర్ణయాల్లో వైఎస్సార్ నిబంధనలు సడలించారు అని సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించింది. వ్యాపారవేత్తలు, కొన్ని ప్రముఖ కంపెనీలు జగన్ కంపెనీలలో భారీ ప్రీమియం చెల్లించి షేర్లు కొనడానికి ప్రతిఫలంగా వైఎస్సార్ ప్రభుత్వం ఆయా కంపెనీలకు ప్రభుత్వపరంగా అనుకూల నిర్ణయాలు తీసుకున్నదని సీబీఐ ఆరోపించింది. ఆయా పనుల కోసం వైఎస్సార్, బి.పి. ఆచార్య లాంటి అధికారుల పైన ఒత్తిడి తీసుకొచ్చారని సీబీఐ పేర్కొన్నది. రాజశేఖరరెడ్డి మీద ఇన్ని ఆరోపణలు చేసిన సీబీఐ, జగన్ మీద చేసిన ఆరోపణలు రెండే. అందులో ఒకటి—జగతి పబ్లికేషన్స్ షేర్ ధరను ఎక్కువ చేసి చూపించారు అని; రెండవది—సూట్‌కేస్ కంపెనీలు మరియు విదేశీ రూట్ల ద్వారా నల్లధనాన్ని జగన్ కంపెనీల వైపు నిధుల రూపంలోకి మళ్లించారు అని సీబీఐ, ఈడీలు తమ ఛార్జ్‌షీట్లలో పేర్కొన్నాయి. అయితే ఈ ఆరోపణల్లో కూడా పెట్టుబడుల రూపంలో నల్లధనాన్ని సమకూర్చింది ప్రభుత్వంతో లబ్ధి పొందిన కంపెనీలే. జగన్‌మోహన్‌రెడ్డి పైన కుట్ర కోణం ఉన్నదని మాత్రమే ఆరోపించారు. అధికార దుర్వినియోగం చేసింది రాజశేఖరరెడ్డి అయితే, ప్రతిఫలం ఆశించి అక్రమ మార్గంలో లబ్ధి పొందింది ఆయా కంపెనీలు. జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఆయనకు నిధులు సమకూర్చిన వాన్‌పిక్, హెటెరో మరియు అరబిందో ఫార్మా భూముల కేటాయింపులో లబ్ధి పొందాయని, ఇందు ప్రాజెక్ట్స్ వారు లేఅవుట్ లాంటి వాటిలో నిబంధనల సడలింపులు పొంది ప్రతిఫలంగా జగతిలో షేర్లను అత్యధిక ప్రీమియంకు కొన్నారనేది సీబీఐ ఛార్జ్‌షీట్ పేర్కొన్న విషయం. పెన్నా, దాల్మియా సిమెంట్స్, లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్, ఇండియా సిమెంట్స్, రాంకీ—వీరి మీద ఉన్నంత నిర్దిష్టమైన ఆరోపణలు కూడా జగన్ పైన లేవు. జగన్‌మోహన్‌రెడ్డి మీద ఉన్న ప్రధానమైన కేసులు మనీ లాండరింగ్, అవినీతి. అవి కూడా జగన్ కంటే ఆయా కంపెనీల మీదనే ఎక్కువ భారం మోపబడి ఉన్నాయి. అసలు అధికార దుర్వినియోగం చేసిన రాజశేఖరరెడ్డే ఇప్పుడు లేరు. ఒక విషయం ఒప్పుకుని తీరాలి: జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్నంత బలమైన న్యాయవాదుల బృందం దేశంలో ఏ రాజకీయ నాయకుడికీ ఉండి ఉండదు. సీబీఐ వేసిన ఛార్జ్‌షీట్లను చూసిన వారికి సీబీఐని జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగా కట్టడి చేయగలిగారో అర్థమవుతుంది. అందుకే పాత కేసుల్లో విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారతాడు అనగానే జగన్ భయపడతాడని అనుకోలేము. అయితే విజయసాయిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ముందస్తు సంకేతం ఇచ్చేది మాత్రం తనకు పావులు కదపగలిగే అవకాశం ఉన్నదనే. ముఖ్యంగా సీబీఐ ఆరోపించిన అవినీతి కేసులో తన సాక్ష్యం జగన్‌మోహన్‌రెడ్డిని ఊచలు లెక్కపెట్టిస్తుంది అని సాయిరెడ్డి ఆలోచన. దీనికి తోడు సూట్‌కేస్ కంపెనీలను తెరిచి వాటి ద్వారా జగతికి డబ్బులు ఎలా మళ్లించారు అనేది సాయిరెడ్డికి తప్ప వేరే ఎవ్వరికీ తెలియదు. ఈ రెండు విషయాలలో సాయిరెడ్డి సాక్ష్యం కీలకం అవుతుంది. ఎక్కడైనా కాగితాల పైన జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారు కానీ సాయిరెడ్డి ఉండరు. రాజశేఖరరెడ్డి మరణించి బతికిపోయారు, లేకుంటే ప్రథమ స్థానంలో ముద్దాయిగా ఆయనే ఉండేవారు. కానీ తన రాజకీయ జీవితం విజయసాయిరెడ్డి చేతిలో ఉన్నదని తెలిసీ జగన్‌మోహన్‌రెడ్డి సాయిరెడ్డిని అంత దూరం పెట్టారంటే, జగన్ ధైర్యం జగన్‌కు ఉండి ఉంటుంది; అది ఏదైనా అయి ఉండవచ్చు. అన్ని కేసులు పెండింగులో ఉండి కూడా తాను ముఖ్యమంత్రి అయిన తరువాత భూకబ్జాల నుండి ఇసుక వరకు, మట్టి నుండి మద్యం వరకు అన్ని దందాలు యథేచ్ఛగా చేయగలిగారంటే వెనుక ఎంత దన్ను ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు మద్యం పాలసీ రూపకల్పన చేసినదే అస్మదీయులకు లబ్ధి చేకూర్చడానికని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసినా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం 'క్యాష్ అండ్ క్యారీ' పాలసీని నడిపింది అంటే ఆయన మద్దతుదారులు ఎంత బలమైనవారో అర్థం చేసుకోవచ్చు. జగన్ టీమ్‌లో ఉన్నప్పుడు సాయిరెడ్డికి ప్రధానమంత్రిని కలవడం సులువు, ఇప్పుడు అపాయింట్‌మెంట్ కూడా దొరకదు; అది జగన్ సత్తాయే కానీ సాయి రెడ్డి సొంతం కాదు. అందుకని సాయిరెడ్డి అప్రూవర్‌గా మారతాను అనగానే జగన్ భయపడతాడు అనుకోవడం పొరపాటు. మరో ఇరవై సంవత్సరాలకు కూడా జగన్ కేసుల విచారణ పూర్తయ్యేలా లేదు. కానీ లోగుట్టు తెలిసిన వ్యక్తి కావటం వలన జగన్‌ను చిరాకు పెట్టగలరు. కూటమి ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్ట్ చేసేంత ధైర్యం చేయకపోవచ్చు, కానీ కేసులు మాత్రం పెడుతుంది. కేసులు పెరిగే కొద్దీ తలనొప్పి పెరుగుతుంది. ఎల్లకాలం జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుదారులే అధికారంలో ఉండరు. వారు అధికారానికి కొద్ది దూరంలో ఉంటే, ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇచ్చినవారే బేరసారాలు సాగించే అవకాశం ఉంటుంది. అది సమీప భవిష్యత్తులో జరిగితే మాత్రం సాయిరెడ్డి కోరిక నెరవేరుతుంది. కానీ అప్రూవర్‌గా మారడం అంటే సాయిరెడ్డి అనుకునేంత సులభం కాదు. అప్రూవర్‌గా మారడం అంటే సాయిరెడ్డి నిజాయతీకి పరీక్ష లాంటిదే. సాయిరెడ్డికి లేనిదే నిజాయతీ. అప్రూవర్‌గా మారినవారు పూర్తి స్థాయిలో నిజాలు చెప్పాలి. 'పింక్ డైమండ్ చంద్రబాబు నాయుడు బెడ్‌రూములో ఉంది' అనేలాంటి ఏ మాటలు పడితే ఆ మాటలు మాట్లాడితే అప్రూవర్ అయినందుకు ఇచ్చే వెసులుబాటును వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది. బహుశా ఢిల్లీ మద్యం కేసులో శరత్‌చంద్రారెడ్డి అప్రూవర్‌గా మారి లబ్ధి పొందిన విషయం చూసి, తనకు అలాంటి అవకాశం వస్తుందని అనుకుని ఉంటారు. అక్కడ టార్గెట్ కేజ్రీవాల్ అయితే, ఇక్కడ టార్గెట్ జగన్‌మోహన్‌రెడ్డి. కేజ్రీవాల్ జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేక పక్షంలో బలమైన నాయకుడు కాబట్టి సీబీఐ, ఈడీల వైఖరి వేరుగా ఉంటుంది. జగన్‌మోహన్‌రెడ్డి అధికార బీజేపీకి ఆప్తమిత్రుడు; అందుకని సాయిరెడ్డి అప్రూవర్ కావడమే పెద్ద పజిల్. కాకపోతే ఈ మధ్య వివేకా హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగప్రవేశం చేయగానే జగన్ బలగంలో చీలికలు వచ్చి బలం తగ్గిపోయింది అనే ఊహాగానాలు పెరిగిపోయాయి. అది వేరే కథ అని తెలియనివారు లేరు; అయినా ప్రచారం జరగాలి కాబట్టి జరుగుతుంది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 6

SEP 6

* 1860: సాంఘిక సేవిక, రచయిత జేన్ ఆడమ్స్ జననం.(మ.1935)
* 1906: వైద్యురాలు,మాజీ పార్లమెంటు సభ్యురాలు కొమర్రాజు అచ్చమాంబ జననం (మ.1964).
* 1936: తెలుగు కవి, సాహితీ విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు జననం. (మ.2016) (చిత్రంలో)
* 1950: అవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ జననం.
* 1966: ఎ.జి.కె. గా ప్రసిద్ధిచెందిన హేతువాది ఆవుల గోపాలకృష్ణమూర్తి మరణం (జ.1917).
* 1968: పాకిస్థాన్ క్రికెట్ క్రీడాకారుడు సయీద్ అన్వర్ జననం.
* 1996: ఆంధ్ర, నాగార్జున విశ్వవిద్యాలయాలలో తెలుగు


అద్దేపల్లి రామమోహనరావు

ఆచార్యుడు తూమాటి దోణప్ప మరణం (జ.1926).
* 2005: ప్రఖ్యాత నేత్రవైద్య నిపుణుడు డాక్టర్ పెరుగు శివారెడ్డి మరణం.(జ.1920).
* 2012: బుల్లితెర రచయిత, నటుడు చెరుకూరి సుమన్ మరణం.(జ.1966)
* 2018: తెలంగాణ అసెంబ్లీ రద్దు చేయబడింది.

## పీసీబీ కొరడా..
# ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా

అమరావతి: రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుకు ఏపీ ప్రభుత్వం భారీ జరిమానా విధించింది. రూ.21.01 కోట్ల జరిమానా విధిస్తూ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆదేశాలు జారీ చేసింది. లోపాలు సరిదిద్దడంలో విఫలం కావడం, నిబంధనల్ని పదేపదే ఉల్లంఘించడంతో పీసీబీ కొరడా ఝుళిపించింది. గోదావరి నది పరిసరాల్లో వ్యర్థాలు విడుదల చేస్తున్నందుకు ఈ భారీ జరిమానా వేసింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆంధ్రా పేపర్ మిల్లుపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ ఇటీవల హెచ్చరించారు.




## ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా
# పీవీ మోహన్

ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పలు రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా పీవీ మోహన్‌ను నియమించారు. ఏపీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మాణికం ఠాగూర్‌ను తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. త్వరలో ఎన్నికలు జరిగే పంజాబ్‌కు ఇన్‌ఛార్జ్‌గా సచిన్ పైలట్‌ను నియమించింది. ఛత్తీస్‌గఢ్ ఇన్‌ఛార్జ్‌గా సుఖ్‌దేవ్ భగత్, మహారాష్ట్రకు సిరివెళ్ల ప్రసాద్‌ను కాంగ్రెస్ నియమించింది.



## ప్రజలను ఇబ్బందిపెట్టేలా
# ఏపీ పేపర్‌మిల్లు వ్యవహరిస్తోంది

: కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుంటే.. రాజమహేంద్రవరంలోని ఏపీ పేపర్ మిల్లు మాత్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని దుర్గంధభరితం చేస్తూ.. పట్టణాలు, గ్రామాలకు స్వచ్ఛ జలాలు ఇవ్వకుండా చేస్తున్న విధానాన్ని పేపర్ మిల్లు సరిచేసుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. అందుకు తామే నాయకత్వం వహించినా ఆశ్చర్యం అవసరంలేదన్నారు. మే నెలలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేపర్ మిల్లు వ్యర్థ జలాలు కలిసే ప్రాంతాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి పరీక్షించి ఏ స్థాయిలో జల కాలుష్యం జరుగుతుందో బహిర్గతం చేశారన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడే పేపర్‌మిల్లు తరహా పరిశ్రమల తీరును ఎండగడతామన్నారు. పన్నులు



చెల్లించకుండా న్యాయవివాదాలతో కాలయాపన చేస్తున్నారని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడంలో దారుణంగా విఫలమయ్యారని మండిపడ్డారు. అలానే కడియంలోని పేపర్‌మిల్లు 70 మంది కార్మికులను రోడ్డున పడేసిందని దుయ్యబట్టారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛగోదావరి సాధనకు తామంతా పోరాడుతామని స్పష్టం చేశారు.

# సీఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

: **36 మంది విశ్రాంత గురువులకు సన్మానం**

హైదరాబాద్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రమవాసులైన 36 మంది విశ్రాంత ఆచార్యులు, ఉపాధ్యాయులు, మహిళా సంక్షేమ కేంద్రం వృత్తి విద్యా కోర్సుల అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ముందుగా భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్ర రాజేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ వి. చెన్నకేశవరావు అధ్యక్షతన సభ జరిగింది.

వక్తల ప్రసంగం : ఈ సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కె. అజయ్ కుమార్, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన మాట్లాడుతూ... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని, ఆయన జయంతి రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సముచితమని కొనియాడారు. సమాజ నిర్మాణంలో, క్రమశిక్షణ గల పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని, కేవలం జ్ఞానాన్ని పంచడమే కాకుండా జీవితానికి సరైన మార్గాన్ని చూపించే గురువులు నిత్య పూజనీయులని పేర్కొన్నారు.

**సన్మానం పొందిన విశ్రాంత గురువులు**











పాఠశాల ఉపాధ్యాయులుగా, ప్రిన్సిపాళ్లుగా, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లుగా సేవలందించిన ఆశ్రమవాసులు బి. వేణుగోపాల్, బి. రంగనాయకమ్మ, సిహెచ్. వెంకటేశ్వరరావు, ఐ.ఎస్. రాజు, యేలేనేని సత్యనారాయణ, జామి వెంకట రత్నాజీ, ఎస్. స్వరాజ్యలక్ష్మి, కొల్లిపార సత్యవతి, కడియాల అనసూయ, డాక్టర్ ఎ. వెంకటేశ్వరరావు, తమ్మారెడ్డి తాన్య, మాదాల జయశ్రీ, వై. కస్తూరి, ఎన్. రాజేంద్రరావు, ఐదుకల్లు అరుణకుమారి, మోర రామకృష్ణారెడ్డి, వై. గంగాధరరావు, ఐ. వెంకటనారాయణ, ఐ. ధనలక్ష్మి, అల్లే సరోజమ్మ, తమ్మా జనార్దన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఈదర రమాదేవి, కనపర్తి జ్యోత్స్న, చెరుకూరి వెంకటరత్నం, కిలారు పూర్ణచంద్రరావు, డాక్టర్ గురజాల హరీష్‌కుమార్, డాక్టర్ అడప రామారావు, అడప నళినికుమారి, ఏటూకూరి నళిని, బి.వి. సత్యవతిలతో పాటు మహిళా శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న జె. కల్పన, తన్వీర్, కృష్ణప్రియ, నజీర, స్రవంతిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానితులు తమ ఉపాధ్యాయ జీవిత అనుభవాలను నెమరువేసుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, సావిత్రీబాయిజ్యోతిరావు పూలే దంపతులు సమాజంలో ఉపాధ్యాయులకు సమున్నత గౌరవం దక్కేలా చేశారని స్మరించుకున్నారు. సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తమను ఇలా గౌరవించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలుపుతూ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు ఎన్. రాజేంద్రరావు, మల్లంపాటి వెంకటేశ్వరరావు, తమ్మారెడ్డి తన్యాకుమారి, సాంబశివరావు, అరుణకుమారి, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యురాలు వి. లలిత, హోమ్ ఫర్ ది ఏజ్డ్ మేనేజర్ శ్రీనివాస్ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు రఘువీరారెడ్డి లేఖ.. జీవో 102 రద్దుపై కీలక విజ్ఞప్తి

- **ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి లేఖ**
- **మెడికల్ అడ్మిషన్లలో 'ఆల్ ఆప్షన్స్' రద్దు చేస్తూ ఇచ్చిన జీవో 102పై ఆందోళన**
- **ఈ జీవోతో 70 మంది రిజర్వ్డ్ కేటగిరీ మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపణ**
- **జీవో 102ను రద్దు చేసి, పాత జీవో 151ని కొనసాగించాలని ప్రభుత్వానికి వినతి**
- **ఇది సామాజిక న్యాయం, మెరిట్‌కు సంబంధించిన విషయమని లేఖలో స్పష్టీకరణ**

రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెం. 102పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎన్. రఘువీరారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన శనివారం ఒక లేఖ రాశారు. మెడికల్ కౌన్సెలింగ్‌లో 'ఆల్ ఆప్షన్స్' విధానాన్ని రద్దు చేస్తూ జారీ చేసిన ఈ జీవో వల్ల మెరిట్ విద్యార్థులకు, సామాజిక న్యాయానికి తీవ్ర



నష్టం వాటిల్లుతోందని ఆయన ఆరోపించారు. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు నిపుణుల కమిటీ సిఫార్సులతో జీవో నెం. 151ను జారీ చేశారని, దాని ప్రకారం 'ఆల్ ఆప్షన్స్' విధానం పారదర్శకంగా అమలయ్యేదని రఘువీరారెడ్డి తన లేఖలో గుర్తుచేశారు. అయితే, 2026 జులై 30న జారీ చేసిన జీవో 102తో ఆ విధానాన్ని నిలిపివేయడం అన్యాయమని పేర్కొన్నారు. దీని దుష్ప్రభావం 2026 అడ్మిషన్లలో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఈ ఏడాది అడ్మిషన్లలో ఏయూ రీజియన్‌లో 43 మంది, ఎస్వీయూ రీజియన్‌లో 27 మంది, మొత్తం 70 మంది రిజర్వ్డ్ కేటగిరీ విద్యార్థులు ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ కంటే మెరుగైన ర్యాంకులు సాధించినప్పటికీ, వారికి రిజర్వేషన్ కోటాలోనే సీట్లు కేటాయించారని రఘువీరారెడ్డి తన లేఖలో గణాంకాలతో సహా వివరించారు. వాస్తవానికి వీరికి ఓపెన్ కాంపిటీషన్‌లో సీట్లు కేటాయించి ఉంటే, ఆ 70 రిజర్వ్డ్ సీట్లు వారి కేటగిరీలోని ఇతర విద్యార్థులకు దక్కేవని, తద్వారా సామాజిక న్యాయం జరిగేదని అభిప్రాయపడ్డారు. అందువల్ల, ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో 102ను పునఃసమీక్షించాలని, 'ఆల్ ఆప్షన్స్' విధానాన్ని పునరుద్ధరించాలని, పాత జీవో 151ని యథాతథంగా కొనసాగించాలని రఘువీరా రెడ్డి డిమాండ్ చేశారు. 2026 అడ్మిషన్ల ప్రక్రియను సమీక్షించి, విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు. ఇది మెరిట్, పారదర్శకత, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో మున్సిపల్ పోరుకు కొత్త రూల్స్.. బ్యాలెట్ బదులు ఈవీఎంలు

- **మున్సిపల్ ఎన్నికల్లో బ్యాలెట్ బదులు తొలిసారిగా ఈవీఎంలు, నోటా వినియోగం**
- **డిప్యూటీ మేయర్ ఎన్నికకు కఠిన నిబంధనలు.. విప్ ధిక్కరిస్తే సభ్యత్వం రద్దు**
- **నామినేషన్ డిపాజిట్లు ఖరారు.. అభ్యర్థులకు అఫిడవిట్ తప్పనిసరి**
- **కడప కార్పొరేషన్‌లో 66కు పెరగనున్న డివిజన్లు**
- **ఎన్నికల నిర్వహణపై మూడు కీలక జీవోలు జారీ చేసిన ప్రభుత్వం**

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న బ్యాలెట్ పత్రాల విధానానికి స్వస్తి పలికి, ఇకపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు) వాడాలని నిర్ణయించింది. ఓటర్లకు తొలిసారిగా 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబౌవ్) ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నూతన నిబంధనలతో కూడిన మూడు కీలక జీవోలను జారీ చేసింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రభుత్వం కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. మున్సిపల్ కార్పొరేషన్ తొలి సమావేశం జరిగిన 15 రోజుల్లోగా డిప్యూటీ మేయర్ ఎన్నిక పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికకు ఒకరోజు ముందే పార్టీలు తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేయాలి. విప్‌ను ధిక్కరించిన వారి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తారు. ఒకవేళ ఓట్లు సమానంగా వస్తే, లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఏదైనా కారణంతో డిప్యూటీ మేయర్ పదవి ఖాళీ అయితే, ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. తాజా నిబంధనల ప్రకారం, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు డిపాజిట్ మొత్తాలను కూడా ఖరారు చేశారు. మేయర్, కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ



అభ్యర్థులు రూ.2,500 డిపాజిట్‌గా చెల్లించాలి. అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, నేరచరిత్రకు సంబంధించిన వివరాలతో నోటరీ చేసిన అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ (సవరణ) చట్టం 2026 (యాక్ట్ నం. 22) ఆగస్టు 28 నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం జీవో నం. 210లో పేర్కొంది. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రిసైడింగ్ అధికారికి అధికారాలు కల్పించారు. ఇదే సమయంలో, కడప నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66కు పెంచుతూ డ్రాఫ్ట్ ప్రతిపాదనలు విడుదల చేసింది. సెప్టెంబర్ 11 వరకు దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి, సెప్టెంబర్ 14న తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ కొత్త నిబంధనలు, మార్గదర్శకాల ఆధారంగానే రాష్ట్రంలో రానున్న పురపాలక ఎన్నికల ప్రక్రియ జరగనుంది.

# ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు

- **రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన**
- **వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి**
- **ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని



కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# టీచర్ స్థానాన్ని మరో టీచర్ తోనే భర్తీ చేయగలం: సీఎం చంద్రబాబు

- **నేడు ఉపాధ్యాయ దినోత్సవం**
- **విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు**
- **సీఎంగా మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేశానని వెల్లడి**
- **టెక్నాలజీ పెరిగినా గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని స్పష్టం**
- **చిన్నప్పుడు టీచర్ చేతిలో దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తుచేసుకున్న సీఎం**
- **తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దేది గురువేనని వ్యాఖ్య**

రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయ నియామకాలు అత్యంత కీలకమని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని



ప్రసంగించారు. ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు న్యాయం చేసేందుకు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి మెగా డీఎస్సీని నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, భక్తవత్సలం అనే గురువు చేతిలో తాను దెబ్బలు తిన్నానని చెప్పారు. అయితే, గురువుల వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. భారతీయ సంస్కృతిలో "మాతృదేవో భవ, పితృదేవో భవ" తర్వాత "ఆచార్య దేవో భవ" అని గురువుకే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని, వారిలో దాగి ఉన్న శాస్త్రవేత్తలను, క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఒక ఉపాధ్యాయుడి స్థానాన్ని మరో ఉపాధ్యాయుడు మాత్రమే భర్తీ చేయగలరని చంద్రబాబు అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, బయటి ప్రపంచం గురించి కూడా నేర్చుకోవాలని, ఈ విషయంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టానని, టెలికాం రంగంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో కీలక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. దాని ఫలితంగానే హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా మారిందని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు సత్తా చాటుతున్నారని అన్నారు. అమెరికా, ఆసియా దేశాల అభివృద్ధికి జ్ఞానమే పునాది అని, రాబోయే 1015 ఏళ్లలో భారత్ స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఒకప్పుడు సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండగా, ఇప్పుడు పోటీతత్వం పెరిగి విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# అప్పుల బాధ తాళలేక.. గోదావరిలోకి దూకిన కుటుంబం

తణుకు, యలమంచిలి: అప్పుల బాధ తాళలేక ఓ కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. తణుకుకు చెందిన నంబూరు శ్రీనివాస్, పద్మిని దంపతులు స్థానికంగా కిరాణా, పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతుండటం, అప్పుల ఒత్తిడి పెరగడంతో.. కుమారుడు (16), కుమార్తె (12)తో కలిసి దంపతులు శనివారం తెల్లవారుజామున చించినాడ బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకారు. ఈ ఘటనలో పద్మినిని జాలర్లు రక్షించగా.. శ్రీనివాస్‌తోపాటు ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. అపస్మారక స్థితిలోకి చేరిన పద్మినిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీనివాస్ సొంతూరు భీమవరంలోని మత్స్యపురి కాగా.. 20 ఏళ్ల క్రితం తణుకు వచ్చి స్థిరపడ్డారని స్థానికులు తెలిపారు. కుమారుడు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం, కుమార్తె స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలే తణుకు మండలం వేల్పూరుకు చెందిన దంపతులు అదే ప్రాంతంలో గోదావరిలోకి దూకిన ఘటనలో భర్త మృతి చెందగా, భార్య ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. పది రోజుల వ్యవధిలో మరో కుటుంబం అదే ప్రాంతంలో నదిలోకి దూకడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

# గణేశ్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

రాబోయే వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో వైభవంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అధికారులను ఆదేశించారు. శనివారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో ఎస్సై స్థాయి నుంచి పైస్థాయి అధికారులతో గణేశ్ ఉత్సవాల బందోబస్తుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ డీసీపీలు తమ పరిధిలో భద్రతా చర్యలు, ఇతర శాఖలతో సమన్వయం, బందోబస్తు ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఇటీవల బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన తరహాలోనే గణేశ్ ఉత్సవాలను కూడా సమష్టి కృషితో ప్రశాంతంగా పూర్తి చేయాలని సూచించారు. 11 రోజులపాటు జరిగే ఉత్సవాలను సీరియస్‌గా తీసుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సాధారణ కార్యక్రమాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

**మండపాలకు జియో ట్యాగింగ్**

అన్ని గణేశ్ మండపాల నిర్వాహకులు హైదరాబాద్ సిటీ పోలీస్ రూపొందించిన యాప్‌లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సీపీ సూచించారు. మండపాల వివరాలను యాప్‌లో జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే




మండపాల వద్ద బారికేడ్లు, క్యూలైన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా నిర్వాహకులను ప్రోత్సహించాలని చెప్పారు. శాంతి కమిటీలు, మండపాల నిర్వాహకులు, వివిధ శాఖల ప్రతినిధులతో ఎస్‌హెచ్‌వోలు నిరంతరం సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లు హైదరాబాద్ సిటీ పరిధిలోకి రావడంతో బాలాపూర్ నుంచి ఖైరతాబాద్ వరకు గణేశ్ ఉత్సవాల నిర్వహణ నగర పోలీసుల పరిధిలోకి వచ్చిందని సీపీ తెలిపారు. బాలాపూర్ నుంచి ప్రధాన నిమజ్జన మార్గాల మీదుగా ట్యాంక్‌బండ్, ఇతర జలాశయాల వరకు రూట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భారీ విగ్రహాల తరలింపులో ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, ఎత్తైన విగ్రహాల వల్ల విద్యుత్ తీగలకు ప్రమాదం జరగకుండా ముందస్తు రూట్ క్లియరెన్స్ చేపట్టాలని సూచించారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల నుంచి వచ్చే విగ్రహాల రాకపోకలపై ఆయా పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఖైరతాబాద్ బడా గణేష్ వంటి అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు.

## ఎవరినిపడితే వారిని భాజపాలోకి చేర్చుకోం: మురళీధర్‌రావు

హైదరాబాద్: మాజీ మంత్రి కొండా సురేఖ ను భాజపాలో చేర్చుకుంటారనే ప్రచారంపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఎవరినిపడితే వాళ్లను పార్టీలో చేర్చుకోబోమని వ్యాఖ్యానించారు.



“కాంగ్రెస్‌లో సంక్షోభం ప్రారంభమైంది. దాన్ని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి కథనాలు వస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం భాజపానే” అని మురళీధర్‌రావు అన్నారు.

## భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సైతం భూములను అమ్మే ప్రయత్నం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. నిషేధిత భూసమస్యలపై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. “కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి దోచుకుంటోంది. భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు.



22ఏ కింద తమ భూములు ఉన్నాయని చాలామందికి తెలియదు. ధరణి పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలా దోచుకుందో అందరికీ తెలుసు. రాష్ట్రాన్ని స్థిరాస్తి వ్యాపారంగా మార్చారు. అన్ని రకాల అనుమతులు ఉన్న భూములను 22ఏ జాబితాలో పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఉంది. వక్ఫ్‌భూములపై తప్ప అన్ని భూములపై సీఎం రేవంత్ కన్నేశారు. రాష్ట్రాన్ని ఆర్‌ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారు. ఉద్యోగులకు జీతాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితికి తెచ్చారు. 60 లక్షల ఎకరాలకు పైగా భూమిని 22ఏలో పెట్టారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉందా? కాంగ్రెస్ నాయకులను, అధికారులను హెచ్చరిస్తున్నా.. మీరు దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజలకు పంచుతాం. బీఆర్‌ఎస్ మాదిరిగా కాంగ్రెస్ కూడా 30 శాతం కమీషన్ అడుగుతోంది. కమీషన్ల కోసమే ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. రానున్న రోజుల్లో 22ఏపై ఇంటింటికీ వెళ్లాలి.. రేవంత్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. 22ఏలో పెట్టిన పేదల భూములను తొలగించాలి” అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి: కేటీఆర్

కరీంనగర్: కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని.. తెలంగాణ తెచ్చిన ఆయన రాజీనామా చేయాలా? అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని డా.బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. “నిరుద్యోగులను కాంగ్రెస్ నిండా ముంచింది. ఈ ప్రభుత్వ పాలనలో విజన్ కాకుండా విధ్వంసమే ఉంది. ఉద్యోగాలు అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



నోటిఫికేషన్ గురించి అడిగితే లూటిఫికేషన్ చేస్తున్నారు” అని కేటీఆర్ విమర్శించారు.

## రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ క్షీణించిపోయింది: రామచందర్ రావు

హైదరాబాద్: భూభారతి, 22ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. “తెలంగాణలోని లక్షలాది ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. పేద, మధ్యతరగతి ప్రజల భూములను చేర్చడంతో వారు అల్లాడిపోతున్నారు. నిషేధిత జాబితాలో నుంచి భూమి తీసేయాలంటే 30 శాతం కమీషన్ అడుగుతున్నారు. రెవెన్యూ వ్యవస్థ



మొత్తం క్షీణించిపోయింది. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందూదొందే. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి బ్రదర్స్ దోచుకుంటున్నారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తక్షణమే తొలగించాలి. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తాం. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుంది” అని అన్నారు. నిరసన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పాల్గొన్నారు.

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?
## రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

- **వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ**
- **ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ**



కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు ‘ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే’ అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. ఈ డిమాండ్‌పై ఈనెల 6న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా ధర్నాపై హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మాట్లాడారు. “బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. పదేళ్లలో 100 ఏళ్ల విధ్వంసం జరిగింది. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ అసెంబ్లీకి హాజరుకాకుండా, తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా, ప్రతిపక్ష నేత పాత్రను నిర్వర్తించకుండా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నాం. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తాం” అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



## కేటీఆర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం.. కారును ఢీకొట్టిన లారీ

- **కేటీఆర్ కరీంనగర్ పర్యటనలో ప్రమాదం**
- **ఆయన ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టిన లారీ**
- **ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ కేటీఆర్**
- **గతంలోనూ పలుమార్లు ఆయన కాన్వాయ్‌లో ఇలాంటి ఘటనలు**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్రుటిలో రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కరీంనగర్‌కు వెళుతుండగా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ,



కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొనేందుకు కేటీఆర్ శనివారం బయలుదేరారు. మార్గమధ్యలో అలుగునూరు వద్ద ఆగగా, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని ప్రయాణం తిరిగి ప్రారంభమైన వెంటనే, కారుకు సమాంతరంగా వెళుతున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగంలోని డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నప్పటికీ, ఆయన సురక్షితంగా బయటపడటంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కేటీఆర్ ప్రయాణాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులైలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు గాయాలయ్యాయి.

## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా? : రఘునందన్ రావు

- **సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం**
- **12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారన్న రఘునందన్ రావు**
- **ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్**



రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?.. కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

- **కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**
- **ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్**
- **కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ**
- **కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి**
- **విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్**

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

**ఇప్పట్లో విస్తరణ లేనట్లే!**

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై



తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

# జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం



పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా కమాండర్‌ను జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. కొంతకాలంగా ఉగ్రవాది యాసిర్ కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు శుక్రవారం యూస్‌మార్గ్‌లో అతడిని గుర్తించాయి. ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం యూస్‌మార్గ్‌లోని పర్వత ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన భద్రతా బలగాలపై ఓ ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో కొనసాగిన ఎదురు కాల్పుల్లో అతడు మరణించాడు. హతమైన ఉగ్రవాదిని యాసిర్‌గా గుర్తించినట్లు శనివారం కశ్మీర్ పోలీసులు వెల్లడించారు. యాసిర్ గతంలో లష్కరే తయ్యిబాకు చెందిన ఓ ఉగ్రముఠాలో సభ్యుడిగా ఉండేవాడు. ఏడాది క్రితం ఆ బృందం నుంచి విడిపోయి, స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు లష్కరే ఉగ్రవాదులతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఉగ్రవాదుల ఫొటోలో యాసిర్ కూడా ఉండడం గమనార్హం. దీంతో కొంత కాలంగా అతడి కదలికలపై భద్రతా బలగాలు నిఘా ఉంచాయి. మే 2024లో పూంఛ్‌లో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై దాడి.. అదే ఏడాది అక్టోబరులో సోనామార్గ్ సమీపంలో కార్మికులపై దాడి, 2024 డిసెంబర్‌లో బోటా పత్రిలో సైన్యంపై దాడి వంటి ఘటనల్లో అతడి ప్రమేయం ఉంది. పూంఛ్ నుంచి యూస్‌మార్గ్ మీదుగా పుల్వామాలోని పఖేర్‌పోరా వైపు ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు తెలపడంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైనికాధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం వారం రోజులుగా మాటువేసినట్లు తెలిపారు. యాసిర్‌తో పాటు మరికొందరు ఉగ్రవాదులు కూడా ఉన్నారని, మిగతా వారికోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

## ఝీరాం వ్యాలీలో మావోయిస్టుల దాడి కేసు.. 10మందిని దోషులుగా తేల్చిన కోర్టు



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పదమూడేళ్ల క్రితం మావోయిస్టులు జరిపిన దాడిలో కాంగ్రెస్ నేతలు సహా 29 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ పూర్తి చేసిన ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు.. పది మందిని దోషులుగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వీరందరికీ సెప్టెంబర్ 16న న్యాయస్థానం శిక్ష ఖరారు చేయనుంది. విచారణ సమయంలో దాదాపు 101 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు న్యాయస్థానం వెల్లడించింది. బస్తర్ జిల్లాలోని ఝీరాం వ్యాలీలో 2013లో కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీ నిర్వహించింది. ఆ సభను లక్ష్యంగా చేసుకొన్న మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. ఆ ఘటనలో కాంగ్రెస్ నేతలు, భద్రతా సిబ్బంది, సామాన్యులు సహా 29 మంది మృతి చెందారు. మరో 30 మంది గాయాలపాలయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర అగ్ర నాయకత్వం తీవ్రంగా నష్టపోయింది. నాటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేశ్, అసెంబ్లీలో మాజీ విపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యా చరణ్ శుక్లా, సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదియార్ తదితరులు ప్రాణాలు కోల్పోయిన వారిలో ఉన్నారు. అయితే, ఈ తీర్పును ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తామని డిఫెన్స్ లాయర్ పేర్కొన్నారు.

## లద్దాఖ్‌లో భారత్ తొలి రాతి చెక్ డ్యామ్.. పెరిగిన నీటిమట్టం



సింధూ నదీ జలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు లద్దాఖ్‌లోని ఉప్సీ ప్రాంతంలో భారత్ తొలి రాతి చెక్‌డ్యామ్‌ను నిర్మించింది. సిమెంట్‌ను వినియోగించకుండా రాతితో చేపట్టిన ఈ నిర్మాణంతో నదిలో నీటిమట్టం దాదాపు 10 అడుగుల మేర పెరిగింది. దీంతో చాలాకాలంగా నీటి కొరత ఎదుర్కొంటున్న స్థానిక గ్రామాలకు సాగునీరు అందే అవకాశం సుగమమైంది. ఈ చెక్‌డ్యామ్ సుమారు 40 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉంది. ఈ ప్రాంతంలో అత్యంత లోతులో సింధూ నది ప్రవహిస్తుండటంతో గతంలో నీటిని పైకి తోడటం రైతులకు కష్టంగా ఉండేది. ఈ నిర్మాణంతో ఉపశమనం లభించినట్లయ్యింది. ఇక, సరిహద్దు ప్రాంతాల్లో నీటి వినియోగాన్ని పెంచే దిశగా లద్దాఖ్ యంత్రాంగం మరిన్ని చర్యలకు సిద్ధమైంది. మరో 36 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపింది. లేహ్‌లో 7 రాక్ చెక్ డ్యామ్‌లు, కార్గిల్ రీజియన్‌లో 29 చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని ప్రతిపాదించింది. వీటి అంచనా వ్యయం రూ.56 కోట్లకు పైగా ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నీటిని స్థానికంగా నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. పాక్‌తో సింధు జలాల ఒప్పందం అమలును పూర్తిగా నిలిపివేసిన వేళ ఈ నిర్మాణాలకు ప్రాధాన్యం ఏర్పడింది.

## నేపాల్ వరదలు.. 10 రోజుల తర్వాత శిథిలాల నుంచి సజీవంగా..!



నేపాల్ లో ఏవైపు చూసినా బురద.. శిథిలాలు.. కూలిపోయిన భవనాలే..! వరదలు సృష్టించిన బీభత్సం అనంతరం సహాయక బృందాలు చేపట్టిన ముమ్మర గాలింపులో పదో రోజైన శనివారం మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఓ చైనా కార్మికుడిని సహాయక సిబ్బంది సురక్షితంగా వెలికితీశారు. అదే సమయంలో శిథిలమైన ఇంట్లో చిక్కుకున్న 64 ఏళ్ల మహిళను సైతం ప్రాణాలతో కాపాడారు. ఈ రెండు ఘటనలు తీవ్ర విషాదంలో కొట్టుమిట్టాడుతున్న నేపాల్‌లో కొత్త ఆశలు నింపాయి. చైనా కార్మికుడి రక్షణ కోసం నేపాల్ సైన్యం, దక్షిణ కొరియాకు చెందిన విపత్తు సహాయక నిపుణులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. 225 మీటర్ల పొడవైన సొరంగంలో చిక్కుకున్న అతడి కోసం తీవ్రంగా శ్రమించారు. బురద, శిథిలాలను తొలగిస్తూ ముందుకు సాగిన సిబ్బంది చివరకు అతడిని సజీవంగా గుర్తించారు. బయటకు తీసుకొచ్చిన వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తనను రక్షించేందుకు వచ్చిన సిబ్బందిని చూసిన క్షణం ఆ వ్యక్తి తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు 26న నేపాల్‌లో హిమానీనదం విరిగిపడడంతో సంభవించిన వరదలకు పలు గ్రామాలు, ఇళ్లు, రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో పెను విషాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 1300 మందికి పైగా మృతి చెందగా.. 5000 మందికి పైగా గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో చిక్కుకున్న వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

## నదిని శుభ్రం చేసిన బిట్టూ.. జాబ్ ఆఫర్ చేసిన నెదర్లాండ్స్ సీఈవో



మధ్యప్రదేశ్‌లో ఇటీవల అజ్నార్ నదిని శుభ్రం చేసిన ఓ 20ఏళ్ల యువకుడు 'బిట్టూ తబాహి' ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఇటీవల వైరల్‌గా మారిన అతడికి నెదర్లాండ్స్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ ఉద్యోగం ఆఫర్ చేసింది. పర్యావరణ పరిరక్షణపై బిట్టూ చూపిన చొరవకు ముగ్ధుడైన డచ్ సంస్థ సీఈవో బోయన్ స్లాట్.. తమతో కలిసి పనిచేయాలంటూ ఆన్‌లైన్‌లో ఆహ్వానించడం విశేషం. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన సురేంద్ర సింగ్ చౌధరీ (బిట్టూ తబాహి) డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నది ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మారడాన్ని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈత రాకున్నా.. గ్లౌజ్‌లు, బూట్లు లేకపోయినా.. వ్యర్థాలు తొలగించే పని మొదలుపెట్టాడు. మధ్యలో కొందరు స్నేహితులు తోడుగా నిలవడంతో కొన్ని నెలల్లోనే పూర్తిచేశాడు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన బిట్టూ ప్రయాణం ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.

## ఉక్రెయిన్‌పై దాడులకు విరామం - పుతిన్ ఆదేశం



సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై దాడులను మూడు రోజుల పాటు నిలిపివేయాలని రష్యా సైన్యాన్ని పుతిన్ ఆదేశించారు. ఈ మేరకు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. యుద్ధం ముగింపు చర్చలకు సంబంధించి అమెరికా రాయబారులు మాస్కోలో పర్యటించనున్న నేపథ్యంలో దాడులకు విరామం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చర్చల వేళ దాడులు చేసుకోవద్దని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒకరోజు ముందే రష్యాకు ప్రతిపాదించారు. తమ వైపు నుంచి ఎటువంటి వైమానిక దాడులు ఉండవని, ప్రత్యర్థి నుంచి ఇదే ఆశిస్తున్నామని అన్నారు. యుద్ధం ముగింపునకు వాస్తవిక మార్గాలను కోరుకుంటున్నామని, ఇందుకు అమెరికా దౌత్యవేత్తలు ఎటువంటి ప్రతిపాదనలతో వస్తున్నారో చూడాల్సి ఉందన్నారు. ఇటీవల ఉక్రెయిన్ నగరాలపై రష్యా భీకర దాడులు చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.



## మిస్ వరల్డ్‌గా డొమినికన్ రిపబ్లిక్ భామ

మిస్ వరల్డ్ 2026 టైటిల్‌ను డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జొహైరీ మోలా దక్కించుకున్నారు. మిస్ వరల్డ్ 2025 ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ (థాయ్‌లాండ్) ఆమెకు అందాల కిరీటాన్ని బహూకరించారు. వియత్నాంలో జరిగిన ఈ పోటీల్లో 110 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొన్నారు. స్పెయిన్‌కు చెందిన ఎలిసబెత్ రెయిన్స్ మొదటి రన్నరప్‌గా, మలేసియాకు చెందిన టానుసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన నికితా పోర్వాల్ టాప్ 40 ఫైనలిస్టులలో ఒకరిగా నిలిచారు. జోహైరీ మోలా యూనివర్సిడాడ్ ఇబెరో అమెరికానా నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీని పొందారు. 'వాయిసెస్ ఆఫ్ టుమారో'ను స్థాపించడంతో పాటు ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బలహీన వర్గాల్లోని పిల్లలు, యువతకు ఆంగ్ల విద్యను అందిస్తున్నారు.

## ఖర్గ్ ద్వీప తీరంలో.. ఇరాన్ చమురు నౌకపై దాడి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ఇరాన్‌కు చెందిన ఓ చమురు నౌకపై అమెరికా దాడి చేసింది. టెహ్రాన్ ప్రధాన చమురు కేంద్రమైన ఖర్గ్ ద్వీప జలాల్లో ఈ నౌక ప్రయాణిస్తున్న సమయంలో దానిపై క్షిపణి దాడి జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దీవికి సమీపంలో పేలుళ్ల శబ్దాలు కూడా వినిపించినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున పొగ కమ్ముకున్న దృశ్యాలు కనిపించాయి. కాగా.. దాడికి గురైన నౌక ఎక్కడికి వెళ్తోంది..? అందులో ఎంత మంది సిబ్బంది ఉన్నారు? వారు సురక్షితమేనా కాదా? అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఇరాన్ చమురుకు ఆయువుపట్టు లాంటి ఖర్గ్ ఐలాండ్‌పై భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఈ క్రమంలోనే తాజాగా ఇరాన్ నౌకపై క్షిపణి దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. దీంతో పశ్చిమాసియాలో పరిణామాలు ఏ మలుపు తిరుగుతాయన్నదానిపై ఉత్కంఠ నెలకొంది

## పికాక్స్ పర్వతంపై త్వరలో భారీ దాడులు: ట్రంప్ మరో వార్నింగ్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని 'పికాక్స్ పర్వతం' కింద ఉన్న భూగర్భ అణు కేంద్రంపై త్వరలోనే దాడిచేస్తామని అన్నారు. అక్కడ జరిగే అణు కార్యకలాపాలను అగ్రరాజ్యం నిశితంగా గమనిస్తోందని తెలిపారు. టెహ్రాన్ చేతికి అణ్వాయుధం దక్కకుండా చూడటమే తమ ప్రధాన ఉద్దేశమని ఓవల్ ఆఫీసులో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై సైనిక చర్య ప్రారంభించి ఐదు నెలలు అయ్యిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ ఐదు నెలల్లో ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకోగలిగి తాము విజయం సాధించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని కుహ్‌ఎ కోలాంగ్ గాజ్ లా పర్వతాన్ని స్థానికంగా పికాక్స్ పర్వతం అని పిలుస్తారు. ఇది జాగ్రాస్ పర్వత శ్రేణిలో.. నతాంజ్ అణు కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరాన్ తన అణు కార్యక్రమానికి అవసరమైన సెంట్రిఫ్యూజ్‌లను ఇక్కడికి తరలించి ఉండొచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు గతంలో అంచనా వేశాయి. ఈ కేంద్రంలో ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే దానిపై మాత్రం స్పష్టత లేదు. కాగా.. ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ సార్వభౌమత్వాన్ని అమెరికా ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. తమపై దాడులకు ప్రతిగా పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు వెల్లడించింది. ఒకవేళ, ట్రంప్ హెచ్చరించినట్లు పికాక్స్ పర్వతంపై అమెరికా దాడి చేస్తే.. పశ్చిమాసియాలో ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది.

## 3 ఇరాన్ ట్యాంకర్లను ధ్వంసం చేసిన అమెరికా



ఇరాన్ చమురు నౌకలపై అమెరికా మరోసారి భీకర దాడులు చేసింది. మూడు నౌకలను ధ్వంసం చేసినట్లు అమెరికా మిలిటరీ వెల్లడించింది. తమ యుద్ధనౌకలపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించడంతో ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు తెలిపింది. అవసరమైతే ఇరాన్ చమురు నౌకా దళాన్ని సైతం నాశనం చేస్తామని హెచ్చరించింది. తాము ధ్వంసం చేసిన ఇరాన్ నౌకలు కీలకంగా పనిచేశాయని, ఐఆర్‌జీసీకి షాడో నెట్‌వర్క్‌లా వ్యవహరించాయని అమెరికా పేర్కొంది. ఆ ప్రాంతంలో గస్తీ కాస్తున్న సమయంలో అమెరికన్ యుద్ధ నౌకలు ఇరాన్ జరిపిన దాడుల నుంచి తప్పించుకున్నాయని తెలిపింది. ఈ ఘటనలో అమెరికా సిబ్బంది గాయపడలేదని పేర్కొంది.

## జల ప్రళయం వేళ.. టిబెట్‌ను వణికించిన భారీ భూకంపం

నేపాల్‌టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన ఆకస్మిక వరదలు ఎంతటి విషాదాన్ని మిగిల్చాయో మాటల్లో చెప్పలేం. నేపాల్ సరిహద్దు సమీపంలోని టిబెట్‌లో ఒక హిమనీనదం కూలిపోవడం గత నెల 26న వచ్చిన జల ప్రళయానికి వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 4 వేల మందికిపైగా ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న నేపాల్ వాసులను భారీ భూకంపం మరింత భయాందోళనకు గురి చేసింది. ఇవాళ టిబెట్ (Tibet)లో భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5గా నమోదైనట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ తెలిపింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. ఈ ప్రకంపనలతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, ఈ భూకంపం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. కాగా, గత నెల సంభవించిన వరదలు నేపాల్ సరిహద్దు పట్టణాలు, లోయలను అతలాకుతలం చేశాయి. వరద విధ్వంసానికి గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయాయి. అనేక ఇళ్లు, వాహనాలు, రోడ్లు, మార్కెట్లు, వంతెనలు, జల విద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి.




# జాగ్వార్ ల్యాండ్ రోవర్ కంపెనీలో 4వేల ఉద్యోగాలు కోత!



టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో దాదాపు 4 వేల ఉద్యోగాలకు కోత విధించనున్నట్లు 'ది టైమ్స్' కథనం పేర్కొంది. అమెరికా టారిఫ్‌లు, వాహన తయారీ ఖర్చులు పెరగడం, విక్రయాలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. మరోవైపు, ఉద్యోగాల కోతకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి సమాచారం అందజేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడనున్నట్లు కంపెనీ పేర్కొన్నట్లు సదరు వార్తా కథనం తెలిపింది. ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేతన సిబ్బంది, మేనేజ్‌మెంట్ టీమ్‌లపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన జేఎల్ఆర్ సంస్థ.. బ్రిటన్‌లో సుమారు 34 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ వ్యయం, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిళ్లను తట్టుకొనేందుకే కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం వరకు తగ్గడం గమనార్హం. మరోవైపు, జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కూడా లక్ష ఉద్యోగాలకు కోత విధిస్తున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# జియో సేవలకు పదేళ్లు




2016 సెప్టెంబర్ 5న వాణిజ్య సేవలు ప్రారంభించిన రిలయన్స్ జియో.. పదేళ్లలో దేశీయ టెలికాం రంగాన్ని మలుపు తిప్పింది. డేటా అయిపోతుందేమోనన్న భయం నుంచి అపరిమిత డిజిటల్ లభ్యత వరకు జరిగిన పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. 2016లో 1 జీబీ డేటా ధర సుమారు రూ.228గా ఉండేది. దేశమంతటా కలిపి 4జీ వాడుతున్న వారి సంఖ్య కోటి కంటే తక్కువే. ఇంటర్నెట్ వేగం సగటున 2.5 ఎంబీపీఎస్ దాటడానికి ముప్పుతిప్పలు పడాల్సి వచ్చేది. హైస్పీడ్ ఇంటర్నెట్‌ను విలాసవంతమైన వస్తువుగా కాకుండా ప్రాథమిక అవసరంగా మార్చడమే ప్రధాన వ్యూహంతో జియో దూసుకెళ్లింది. ఫలితంగా.. ఈ దశాబ్ద కాలంలో 1 జీబీ డేటా ధర ఏకంగా 97 శాతం తగ్గి, ప్రస్తుతం రూ.7.9కి పడిపోయింది. దేశంలో 4జీ, 5జీ వాడే చందాదారుల సంఖ్య 93.8 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఒక జియో వినియోగదారు సగటున నెలకు ఏకంగా 42.3 జీబీ డేటాను వాడుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో రికార్డు వృద్ధి: తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) టెలికాం సర్కిల్‌లో జియో సేవలు ప్రారంభించిన తొలి నెలలోనే 12.4 లక్షల కనెక్షన్లను సాధించింది. జూన్ 2026 నాటికి ఇవి 3.25 కోట్లకు చేరాయి. 2024 జూన్ నాటికి ఏపీ, తెలంగాణలో జియో గరిష్ఠంగా 3.30 కోట్ల చందాదారుల మైలురాయిని తాకింది. 2026 జూన్ నాటికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 8.83 కోట్ల వైర్‌లెస్ కనెక్షన్లలో 36.9% వాటాతో జియో బలమైన రెండో అతిపెద్ద టెలికాం వ్యవస్థగా అవతరించింది.

# కలిసొచ్చిన ఏఐ రంగం.. 15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద



కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలసిరావడంతో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్ట్రాటా (Altrata) తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది. గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

# ఎగుమతుల కోసమే సరుకు నిల్వ ఉంచుకోవాలి

* **ఎఫ్‌డీఐ కలిగిన ఇ-కామర్స్ సంస్థలకు నిబంధనలు నోటిపై చేసిన ఆర్థిక శాఖ**



దిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) కలిగిన ఇకామర్స్ సంస్థలకు సంబంధించి భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం ఎగుమతుల కోసం మాత్రమే ఇకామర్స్ సంస్థలు తమ సొంత సరుకును నిల్వ ఉంచుకోవడానికి వీలు కల్పిస్తూ కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) 2026 సెప్టెంబరు 2 నాటి నోటిఫికేషన్ ద్వారా ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ (నాన్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్) రూల్స్ 2019కి సవరణలు చేసింది. వీటి ప్రకారం.. ఇకామర్స్ సంస్థలు నిల్వ ఉంచే సరుకులు కచ్చితంగా మన దేశంలో తయారైనవి లేదా ఉత్పత్తి చేసినవై ఉండాలి. ఈ సడలింపులు విదేశీ వాణిజ్య విధానం 2023, ఫెమా నిబంధనలకు లోబడి ఉంటాయి. సరుకులు భారతదేశంలో తయారైనవేనని, వాటి ఎగుమతి ద్వారా లభించే ఆదాయం నిబంధనల ప్రకారమే జరుగుతోందని ఇకామర్స్ సంస్థలు ప్రతి లావాదేవీలోనూ నిరూపించాల్సి ఉంటుంది. దేశీయ మార్కెట్‌పై ప్రభావం ఇలా..: మన దేశంలోని స్థానిక కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను రక్షించడానికి దేశీయ బీ2సీ (బిజినెస్ టు కన్జూమర్) విక్రయాల కోసం ఇన్వెంటరీ ఆధారిత ఇకామర్స్ నమూనాపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం అలాగే ఉంచింది. విదేశీ నిధులున్న అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు మన దేశంలో సొంతంగా సరుకులను నిల్వ ఉంచుకుని ఇక్కడి వినియోగదార్లకు నేరుగా విక్రయించడానికి వీల్లేదు. ఒకవేళ ఎగుమతుల కోసం కేటాయించిన ఇన్వెంటరీని దేశీయ విపణిలోకి మళ్లిస్తే అది ఫెమా నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. కఠిన చర్యలు ఉంటాయి. దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ వస్తువుల విక్రయాలు భారీగా పెరుగుతాయి. భారతీయ తయారీదార్లకు ప్రోత్సాహం లభిస్తుంది.

# టీచర్స్ డే.. తండ్రి పేరిట ఫెలోషిప్‌ను ప్రకటించిన సచిన్



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన తండ్రి ప్రొఫెసర్ రమేశ్ తెందుల్కర్ జ్ఞాపకార్థం క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కీలక ప్రకటన చేశారు. ప్రతి సంవత్సరం ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) చేసే ఒక విద్యార్థికి ఆర్థికంగా సాయం అందించనున్నారు. యువ డాక్టర్లను ప్రోత్సహించేందుకు ముందడుగు వేశారు. ఇంగా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి తెందుల్కర్ ఫౌండేషన్ ఈ ఫెలోషిప్‌ను ఇవ్వనుంది. శ్రీనగర్‌లోని క్లెఫ్ట్, క్రానియోఫేసియల్ కేర్‌లో ప్రత్యేక శిక్షణ కోసం ఏటా ఎండీ చేసే ఒకరిని ఎంపిక చేయనుంది. "నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. మా నాన్న నాలో అంతకంటే ఎక్కువ చూశారు. నేను ఏమవ్వాలో నిర్ణయించడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. స్వయంగా కనుక్కొనేందుకు అవసరమైన స్వేచ్ఛను నాకు ఇచ్చారు. నా తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం ఫెలోషిప్‌ను అందించనుండటం సంతోషంగా ఉంది. మా నాన్న నమ్మిన సిద్ధాంతం ఇది. విద్యే అవకాశాలను సృష్టిస్తాయని ఆయన భావించారు. అది ఇతరులకు ఉపయోగపడితే అంతకుమించిన పరమార్థం మరొకటి ఉండదు. ఉపాధ్యాయుని పాఠాలు ఒక విద్యార్థితో ప్రారంభం కావచ్చు. కానీ, వారి ప్రభావం ఎందరో జీవితాలకు, ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని సచిన్ పోస్టు పెట్టారు.




# కేఎల్ లేకపోయినా దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు మేం సిద్ధం: తిలక్ వర్మ



దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచే ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య తుది పోరు జరగనుంది. తిలక్ వర్మ నాయకత్వంలోని సౌత్ జోన్ జట్టులో సిరాజ్, దేవదత్ పడిక్కల్ ఆడటం ఖాయమే. అయితే, కేఎల్ రాహుల్ రాకపై సందిగ్ధత ఉంది. రాహుల్ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని తిలక్ వెల్లడించాడు. ఫైనల్ నేపథ్యంలో ఇరు జట్ల కెప్టెన్లు తిలక్, ఇషాన్ కిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

**షమీని సమర్థంగా అడ్డుకొంటాం: తిలక్**

"సీనియర్ పేసర్ షమీని అడ్డుకొనేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతోంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం" అని తిలక్ వర్మ తెలిపాడు.

**అది.. కేవలం నంబర్ మాత్రమే: ఇషాన్**

"మహ్మద్ షమీ అత్యుత్తమ ప్లేయర్. బెంగాల్ తరఫున ఆడేటప్పటి నుంచి అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. వికెట్లు తీయడంతోపాటు మైదానంలో తన శక్తినంతా వినియోగిస్తాడు. భారత క్రికెట్‌కూ ఎన్నో సేవలు అందించాడు. ఇప్పుడందరూ వయసు గురించి మాట్లాడుతున్నారు. కానీ, అది కేవలం ఒక నంబర్ మాత్రమే. అతడి కష్టం గురించి ఎవరూ అనడం లేదు. ఇప్పటికీ షమీ భాయ్‌లో వికెట్ల దాహం తీరలేదు" అని ఇషాన్ తెలిపాడు. షమీతోపాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. సెమీస్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

**దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు అగర్కార్**

చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ దులీప్ ట్రోఫీ ఫైనల్‌ను చూసేందుకు చెన్నై వెళ్లనున్నాడు. అతడి పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది వరల్డ్ కప్ వరకూ పొడిగింపు ఉండే అవకాశం ఉంది. ఆ విషయంపై చెన్నైలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల రివ్యూ మీటింగ్‌కు వ్యక్తిగత కారణాల వల్ల అగార్కర్ గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఆసియా గేమ్స్ కోసం భారత్ మరో రెండు వారాల్లో జపాన్‌కు వెళ్లనుంది. జట్టుతోపాటు అదనంగా మరికొందరిని నెట్ బౌలర్లుగా పంపించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితోపాటు మోసిన్ ఖాన్ అవకాశం ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆసియా క్రీడలకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్న వీవీఎస్ లక్ష్మణ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

# ఆసియా కప్.. భారత్ హ్యాట్రిక్ విజయం.. పాక్ చిత్తు




దుబాయ్: మహిళల ఆసియా కప్‌లో భారత్ హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఇప్పటికే సెమీస్ చేరిన టీమ్‌ఇండియా.. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత పాక్ 55 పరుగులకే కుప్పకూలగా.. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. షెఫాలి వర్మ (12), హర్మన్‌ప్రీత్ (18*), దీప్తి శర్మ (12*) పరుగులు చేశారు. మంధాన (9), ప్రతీకా రావల్ (4) రన్స్ చేశారు. తొలుత భారత బౌలర్ల ధాటికి పాక్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మనోళ్ల బౌలింగ్ ధాటికి పాక్ 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా వారంతా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. భారత బౌలర్లలో శ్రీచరణి (3/7), ప్రేమ రావత్ (3/9) సత్తాచాటారు. దీప్తి శర్మ 2, షెఫాలి వర్మ ఒక వికెట్ పడగొట్టారు. పాకిస్థాన్ జట్టుకు టీ20ల్లో ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. అంతకుముందు పాక్ 2024లో న్యూజిలాండ్‌పై 56 పరుగులకు ఆలౌటైంది.



# పీసీబీ వద్దే రిమోట్ కంట్రోల్.. బాబర్ 'డమ్మీ కెప్టెన్': మాజీ క్రికెటర్ విమర్శలు

పాకిస్థాన్ క్రికెట్ పతనావస్థకు చేరడానికి ప్రధాన కారణం బోర్డేనని మాజీ ఆటగాళ్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన తర్వాత ఆటగాళ్లతోపాటు కోచింగ్ సిబ్బందిపై పీసీబీ వేటు వేసింది. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను స్వదేశానికి పిలిపించింది. ఇక, సెలక్టర్ పదవికి మిస్బా ఉల్ హక్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. ఇప్పుడు పీసీబీ దృష్టంతా చీఫ్ సెలక్టర్ అకిబ్ జావెద్‌పైనే ఉంది. ఈ నేపథ్యంలోనే పాక్ బోర్డు తర్వాతి టార్గెట్.. కెప్టెన్ బాబర్ అజామ్ అంటూ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ వ్యాఖ్యానించాడు. "మీరు (పీసీబీని ఉద్దేశిస్తూ) జట్టును 'రిమోట్ కంట్రోల్' ద్వారానే నడపాలని అనుకుంటున్నట్లు ఉంది. సర్ఫరాజ్, ఉమర్ గుల్‌ను ఎందుకు ఇంగ్లాండ్‌కు పంపారు? ఇప్పుడు ఆ ఇద్దరిని ఎందుకు వెనక్కి పిలిచారు? గ్యారీ కిరిస్టెన్, జాసన్ గిలెస్పీ నుంచి అధికారాలను ఎందుకు తొలగించారు? మీ నిర్ణయాలు ఏంటో అర్థం కావడం లేదు. మీ మాట కెప్టెన్ బాబర్ అజామ్ వినకపోతే అతడిని తొలగించి ఉండాల్సింది కదా..! అలా కాకుండా సర్ఫరాజ్, ఉమర్‌పై వేటు ఎందుకు? వీరి తర్వాత మీ లక్ష్యం ఎవరు? బాబర్ అజామేనా?" అని ఘాటుగా పోస్టు పెట్టాడు.

**బాబర్ రాజీనామా చేయాల్సింది..**

"పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేతిలో బలిపశువులైన ఆటగాళ్లు, కోచ్‌లకు సంఘీభావంగా కెప్టెన్ బాబర్ అజామ్ ఇప్పటికే రాజీనామా చేస్తే బాగుండేది. స్క్వాడ్‌లోని సగం జట్టును వెనక్కి పిలిపించడమంటే చిన్న విషయం కాదు. ఒకవేళ నేను ఆ ప్లేస్‌లో ఉండుంటే.. కెప్టెన్సీని వదిలేసేవాడిని. ఇప్పుడు నువ్వు (బాబర్) డమ్మీ సారథిగా మారిపోయావు. ఇమామ్‌ను స్వదేశానికి పంపించారంటే అతడికి గాయమైంది కాబట్టి అని అర్థం చేసుకుంటాం.

# గూగుల్‌నడిగితే నా సక్సెస్ తెలుస్తది

కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకొని హీరోయిన్ వైష్ణవి చైతన్య ఎమోషనల్ అయ్యింది. తాజాగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఎపిక్ మూవీ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో ఆసక్తికర విషయాలు వెల్లడించింది. "నిన్ను ఎవరైనా గుర్తుపడతారా, నువ్వు ఎవరికైనా తెలుసా అని అడిగే వారు. ఇంటర్‌నెట్‌లో నీ పేరు టైప్ చేస్తే ఏమైనా ఇన్ఫర్మేషన్ వస్తుందా అని చులకనగా మాట్లాడేవారు. అసలు నీ పేరే ఎవరికి తెలియదని ఛాన్స్‌లను రిజెక్ట్ చేసేవారు. ఇలాంటివి ఎన్నో ఎదుర్కొన్నా. ఆ మాటలు చాలా బాధపెట్టేవి. ఇప్పుడు గూగుల్‌లో సర్చ్ చేస్తే నా జర్నీ, సినిమాల సమాచారం బోలెడు కనిపిస్తుంది. ఇదే నేను సాధించిన సక్సెస్‌గా భావిస్తున్నా" అంటూ ఎమోషనల్ అయ్యింది. దీంతో ఆమె కామెంట్లు వైరల్ అవుతోన్నాయి. ఆమె కథానాయికగా నటించిన ఎపిక్ మూవీ సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రాబోతుంది. ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న ఈ మూవీకి ఆదిత్య హసన్ దర్శకత్వం వహించారు.





# ట్రైలర్‌కు వస్తానన్నా.. ఒచ్చేసినా

తన మరిది ఆనంద్ దేవరకొండ నటించిన ఎపిక్ మూవీపై రష్మిక మందన్న ప్రశంసలు కురిపించింది. హైదరాబాద్‌లో తాజాగా నిర్వహించిన ట్రైలర్ లాంఛ్ వేడుకలో ఆమె తెలంగాణ యాసలో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ''ఎపిక్' ట్రైలర్ నాకు నచ్చింది. కొరియన్ డ్రామాల్లో ఉండే వైబ్ కనిపించింది. ఆనంద్, వైష్ణవి ఈ సినిమా కోసం మస్తు కష్టవడ్డరు. ఈ ఈవెంట్‌కు రావాలని ఆనంద్ అడిగిండు. పక్కా వస్తానని మాటిచ్చా.. ఒచ్చేసినా. ఆనంద్ సిన్మాల కోసం చాలా కష్టవడుతుంటడు. వైష్ణవి చేసిన కడలి పాత్ర గొప్పగా ఉంటుందని నమ్ముతున్నా. అని మాట్లాడుకొచ్చింది రశ్మిక. దీంతో ఆమె స్పీచ్ వైరల్ అవుతోంది.

# మోహన్‌లాల్ మూవీలో లక్కీ ఛాన్స్

లెనిన్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే లక్కీ ఛాన్స్ కొట్టేసింది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌తో కలిసి ఓ సినిమా చేయబోతుంది. వార్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమాతోనే మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. మోహన్‌లాల్ హీరోగా సర్వైవల్ థ్రిల్లర్ మూవీని శనివారం అనౌన్స్ చేశారు. రష్యా – ఉక్రెయిన్ వార్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ట్విస్ట్‌లు, టర్న్‌లతో సర్‌ప్రైజింగ్‌గా ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. గత సినిమాలకు పూర్తి భిన్నంగా భాగ్యశ్రీ లుక్ ఉంటుందని అంటున్నారు. ఆపరేషన్ గంగా పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ప్రస్తుతం తమిళంలో శివకార్తికేయన్‌తో సియోన్ సినిమా చేస్తోంది ఈ అందగత్తే.



సినిమా

## నిజమైన ప్రేమలో ఆప్షన్లుండవ్

బ్రేకప్‌పై మరోసారి అనుపమ పరమేశ్వరన్ రియాక్ట్ అయ్యింది. తాజాగా మరోమారు ఇన్‌డైరెక్ట్‌గా ధృవ్‌పై సెటైర్స్ వేసింది. శనివారం ఇన్‌స్టాలో అభిమానులతో ముచ్చటించింది. కెరీర్, లవ్.. ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సివస్తే అమ్మాయిలకు మీరిచ్చే సలహా ఏంటని ఓ నెటిజన్ అనుపమను ప్రశ్న అడిగింది. నిజమైన ప్రేమలో ఆప్షన్లు ఉండవు. ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన అవసరం ఎప్పటికీ రాదు అంటూ రిప్లై ఇచ్చింది. ధృవ్‌ను ఉద్దేశించే ఈ కామెంట్లు చేసిందని నెటిజన్లు పేర్కొంటున్నారు.

# ఆ నలుగురు డైరెక్టర్ కొత్త ప్రయోగం




ఎనిమిదేళ్ల పాటు సినిమాలకు దూరమైన ఆ నలుగురు దర్శకుడు చంద్రసిద్ధార్థ్ మళ్లీ డైరెక్టర్‌గా రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఓ లెంగ్తీ టైటిల్‌తో సినిమా చేస్తున్నాడు. ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు అనే పేరుతో తెరకెక్కుతోన్న ఈ మూవీ ఈనెల 18న థియేటర్లలోకి రాబోతుంది. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, పశ్చాత్తాపం వంటి అంశాల చుట్టూ ఈ కథ సాగనుంది. దర్శకత్వం వహిస్తూనే స్వయంగా చంద్ర సిద్ధార్థ్ ఈ మూవీని నిర్మించారు. హర్ష హీరోగా నటిస్తున్నాడు. జే రెక్స్ సంగీతాన్ని సమకూర్చగా నాలుగు పాటలను చంద్రసిద్ధార్థ్ రాయడం గమనార్హం. కాగా భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్ ఇదే కావడం విశేషం.